నిరంతర వెలుగులు

- ప్రతి పల్లెకు విద్యుత్ సరఫరాకు ప్రణాళిక
- టౌన్ ఫీడర్ల లైన్ల నిర్మాణం
- విద్యుత్ సమస్యకు శాశ్వత పరిష్కారం
- రూ.1.66 కోట్ల వ్యయంతో టౌన్ ఫీడర్లు
- ఐదు గ్రామాల్లో లో ఓల్టేజీ సమస్యకు చెక్


దేవరపల్లిలోని 33/11 కేవీ సబ్ స్టేషన్


దేవరపల్లి పీహెచ్‌సీ వద్ద ఏర్పాటు చేసిన 100 కేవీ కొత్త ట్రాన్స్‌ఫార్మర్

దేవరపల్లి: గ్రామాలకు నిరంతర వెలుగులు రానున్నాయి. లోఓల్టేజీ సమస్యకు చెక్ పెట్టారు. విద్యుత్ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించింది. దేవరపల్లి మండలంలో ఎప్పటి నుంచో ఉన్న విద్యుత్ సమస్యకు ఏపీఈపీడీసీఎల్ అధికారులు చర్యలు చేపట్టారు. ఓ ప్రత్యేక ప్రణాళికతో ముందుకు వెళుతున్నారు. అధికారులు తీసుకున్న చొరవపై ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

దాదాపు 50 ఏళ్ల క్రితం వేసిన విద్యుత్ స్తంభాలు శిథిలావస్థకు చేరడంతో విద్యుత్ తీగలు సాగి కొద్దిపాటి గాలులకు తెగిపడడంతో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం కలిగేది. వర్షం వస్తే గంటల తరబడి సరఫరా ఆగిపోయేది. దీంతో గృహ వినియోగదారులతో పాటు, పరిశ్రమలు, రైతులు ఇబ్బందులకు గురికావాల్సి వచ్చేది. సుమారు మూడు దశాబ్దాల నుంచి ప్రజలు విద్యుత్ సమస్యతో ఇబ్బంది పడుతున్నారు. దేవరపల్లి మండలంలో విద్యుత్ సమస్య పరిష్కారానికి గత ప్రభుత్వంలో అధికారులు ప్రతిపాదనలు తయారు చేసి అందజేశారు. నిధులు మంజూరు అయినప్పటికి అప్పటి అధికారుల నిర్లక్ష్యం వల్ల పనులు ప్రారంభం కాలేదు. 2024 అక్టోబరులో సమస్యకు శాశ్వత పరిష్కారానికి అధికారులు చర్యలు చేపట్టారు.

రూ.1.66 కోట్ల వ్యయంతో ఫీడర్ల ఏర్పాటు

ఆర్‌బీఎస్ఎస్ పథకంలో మండలంలోని ఐదు గ్రామాలకు నిరంతర విద్యుత్ సరఫరాకు టౌన్‌ఫీడర్ల నిర్మాణం చేపట్టారు. అక్టోబర్‌లో పనులకు శ్రీకారం చుట్టారు. పట్టణాన్ని ఐదు సెక్షన్లగా విభజించి ఏబీ స్విచ్‌లు, కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు, 11 కేవీ లైన్ల నిర్మాణ పనులు చేపట్టారు. సుమారు ఆరు వేల విద్యుత్ సర్వీసులు పట్టణంలో ఉండడం, ఓవర్ లోడ్ కావడం వల్ల నిత్యం సరఫరాకు అంతరాయం ఏర్పడేది. దీని పరిష్కారానికి దేవరపల్లిలో రెండో టౌన్‌ఫీడర్ నిర్మాణం చేశారు. సబ్‌స్టేషన్ నుంచి రామన్నపాలెం రోడ్డు వరకు కొత్తగా మార్కెట్ టౌన్‌ఫీడరు ఏర్పాటు చేశారు. పాతబడిన లైన్లను తొలగించి 12.5 మీటర్ల ఎత్తు గల స్తంభాలను నిర్మాణం చేసి, కొత్త తీగలను ఏర్పాటు చేశారు. పట్టణంలోని సర్వీసులను రెండు భాగాలుగా విభజించి ఓవర్ లోడ్ సమస్యకు శాశ్వత పరిష్కారం చేశారు. దీంతో పాటు బందపురం, రంగరాయకాలనీ, గొల్లగూడెం, దుద్దుకూరు, లక్ష్మీపురం గ్రామాలకు టౌన్‌ఫీడర్లను ఏర్పాటు చేశారు. ఆర్‌డీఎస్ఎస్ పథకంలో కేంద్ర ప్రభుత్వం నిధులు రూ.60 శాతం, రాష్ట్ర ప్రభుత్వ నిధులు రూ.40 శాతం మొత్తం రూ.1.66 కోట్ల వ్యయంతో పనులు పూర్తి చేశారు. పల్లంట్లలో పవర్ టాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు రూ.1.16 కోట్లు మంజూరైనట్టు అధికారులు తెలిపారు. త్వరలో గ్రామంలో పనులు చేపట్టనున్నట్టు అధికారులు తెలిపారు. మండలంలో రామన్నపాలెం, ధుమంతునిగూడెం, కొత్తగూడెం, సుబ్బరాయపురం గ్రామాలకు టౌన్‌ఫీడర్లను ఏర్పాటు చేయాల్సి ఉంది. ఏబీ స్విచ్‌ల వల్ల విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు తొలిగాయి. గతంలో ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ఏబీ స్విచ్‌లు లేకపోవడం వల్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడినప్పుడు సబ్‌స్టేషన్ వద్ద సరఫరాను పూర్తిగా నిలుపుదల చేయవలసి వచ్చేది. దీనివల్ల పట్టణ ప్రజలు ఇబ్బంది పడేవారు. ఐదు సెక్షన్లుగా విభజించి ఏబీ స్విచ్‌లు ఏర్పాటు చేయడం వల్ల ఏ ప్రాంతంలో సమస్య వస్తే ఆ సెక్షన్ పరిధిలో సరఫరాను నిలుపుదల చేస్తే సరిపోతుంది.

కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు

గ్రామాల్లోని సింగిల్ ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్ల స్థానంలో 63,100 కేవీ ట్రాన్స్‌పార్మర్లను ఏర్పాటు చేస్తున్నారు. దుద్దుకూరులో ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయగా, మిగిలిన గ్రామాల్లో చేయవలసి ఉంది. దుద్దుకూరులో 8, గౌరీపట్నంలో 6, బందపురంలో 8, రంగరాయకాలనీలో రెండు, లక్ష్మీపురంలో 3, గొల్లగూడెంలో 3, అచ్చియపాలెంలో ఒకటి, బుచ్చియపాలెంలో ఒకటి ఏర్పాటు చేస్తున్నారు.

లో ఓల్టేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం



దేవరపల్లి సెక్షన్ పరిధిలోని అన్ని గ్రామల్లో లో ఓల్టేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చేస్తున్నాం. ప్రతి పల్లెకు నిరంతర 24/7 విద్యుత్ సరఫరాకు చర్యలు చేపట్టాం. రూ.48 లక్షల వ్యయంతో దేవరపల్లిలో మార్కెట్ టౌన్‌ఫీడర్, రూ.98 లక్షల వ్యయంతో బందపురం, రంగరాయకాలనీ, దుద్దుకూరు, లక్ష్మీపురం గ్రామాలకు టౌన్‌ఫీడర్, రూ.20 లక్షల వ్యయంతో గొల్లగూడెంకు టౌన్‌ఫీడర్ ఏర్పాటు చేశాం. పల్లంట్లలో రూ.1.16 కోట్ల వ్యయంతో పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తున్నాం. మరొక 20 ఏళ్ల వరకు విద్యుత్ సమస్య రాదు. ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ తిలక్ కుమార్, ఈఈ ఎన్.నారాయణ అప్పారావు, ఏడీఈ శివశంకర్ సహకారంతో సమస్యకు పరిష్కారం లభించింది.

– చిలకా వెంకట్రావు, ఏఈ, ఏపీఈపీడీసీఎల్, దేవరపల్లి

క్లుప్తంగా

వైద్యసేవల్లో నర్సుల పాత్ర కీలకం


నిడదవోలులో కేక్ కట్ చేస్తున్న నర్సులు

నిడదవోలు: వైద్యసేవల్లో నర్సుల పాత్ర కీలకమని కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సుల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు జి.దయామణి అన్నారు. స్థానిక ఏబీఎస్ టౌన్‌హాల్‌లో ప్రభుత్వ, కాంట్రాక్ట్ నర్సింగ్‌ల సంఘాల ఆధ్వర్యంలో అంతర్జాతీయ నర్సుల దినోత్సవం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా దయామణి మాట్లాడుతూ కరోనా లాంటి విపత్కర పరిస్థితుల్లో వైద్యులతో సమానంగా నర్సులు సేవలందించారన్నారు. అనంతరం ఫ్లోరిన్స్ నైటింగేల్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నర్సులంతా కలసి కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో నిడదవోలు సామాజిక ఆరోగ్య కేంద్రం హెడ్‌నర్స్ హెప్సీబా, కేవీపీఎస్ నాయకులు జువ్వల రాంబాబు, రక్తదాత సరిపల్లి రమణ, నర్సులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

దేవరపల్లి: రామన్నపాలెం సబ్‌స్టేషన్ పరిధిలోని బుచ్చియపాలెం, అచ్చియపాలెం గ్రామాలకు మంగళవారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీ ఈపీడీసీఎల్ నిడదవోలు ఆపరేషన్ ఈఈ ఎన్.నారాయణ అప్పారావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

విజయవాడలో రేపు ఏపీటీఎఫ్ ధర్నా

తాళ్లపూడి: ఉపాధ్యాయ సమస్యలపై బుధవారం ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో విజయవాడలో ధర్నా చౌక్ వద్ద నిర్వహించే రాష్ట్ర స్థాయి ధర్నా నిర్వహించనున్నారు. ఈ ధర్నాలో ఉపాధ్యాయులు, ఏపీటీఎఫ్ కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొనేలా కొవ్వూరు డివిజన్ కార్యకర్తలు, నాయకులు కృషి చేయాలని ఏపీటీఎఫ్ తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు దున్నా దుర్గారావు పిలుపునిచ్చారు. విజయవాడ ధర్నా విజయవంతం చేయాలని సోమవారం స్థానిక ప్రాథమిక పాఠశాలలో సమావేశం నిర్వహించారు. సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు పి గంగరాజు, తాళ్లపూడి ప్రధాన కార్యదర్శి యాదం శంకరం, తాళ్లపూడి శాఖ మహిళా అధ్యక్షురాలు కనక దుర్గ, కొవ్వూరు రూరల్ కార్యదర్శి విష్ణు, జిల్లా ఉపాధ్యక్షుడు గంగరాజు, జిల్లా కార్యదర్శులు అనితా జ్యోతి, రాజశేఖర్, నాయకులు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

తాళ్లపూడి(కొవ్వూరు): సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా బాధితుల వైద్య ఖర్చుల కోసం సాయం అందజేస్తున్నట్టు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. కొవ్వూరులోని టీడీపీ కార్యాలయం వద్ద సోమవారం సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వర రావు చేతుల మీదుగా అందజేశారు. చాగల్లు మండలంలో నలుగురి రూ.10,34,208, కొవ్వూరు మండలం తొమ్మిది మందికి రూ. 7,40,940, తాళ్లపూడి మండలం ముగ్గురికి విలువ రూ. 5,83,483 కలిపి మొత్తం 16 చెక్కులకు రూ. 23,58,631లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు.

ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వ నిర్లక్ష్యం

వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు



తాళ్లపూడి(కొవ్వూరు): రైతుల నుంచి కనీసం ధాన్యం కొనుగోలు చేయలేని స్థితిలో ప్రభుత్వం ఉందని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు ఆరోపించారు. సోమవారం ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. కొవ్వూరు నేషనల్ హైవేపై రైతులు ధాన్యం ట్రాక్టర్లతో ఆందోళన చేయడంపై ఆయన విచారం వ్యక్తం చేశారు. రైతులు పండించిన ధాన్యం కొనుగోలు చేయాలని తాము గత నెల రోజులుగా అధికారులకు వినతి పత్రాలు ఇవ్వడంతో పాటు, ఆందోళన చేసినట్టు తెలిపారు. అయినా కూటమి ప్రభుత్వం ఏ మాత్రం స్పందించడం లేదని, దీంతో రైతులు దిక్కు తోచని స్థితిలో ఉన్నారని అన్నారు. అధికారులు ఇప్పటికైనా పండించిన ధాన్యం కొనుగోలు చేయాలని కోరారు. గతంలో ఎన్నడూ ఇలా జరగలేదని అన్నారు.

కొనసాగుతున్న క్వారీ పొక్లెయిన్ ఆపరేటర్ల సమ్మె

- నూతన వేతన ఒప్పందం చేయాలని డిమాండ్
- స్తంభించిన క్వారీ పరిశ్రమ


గౌరీపట్నం వద్ద సమ్మె చేస్తున్న పొక్లెయిన్ ఆపరేటర్లు

దేవరపల్లి: వేతన ఒప్పందం కాలపరిమితి ముగిసినందున నూతన వేతన ఒప్పందం చేయాలని క్వారీ యజమానులను డిమాండ్ చేస్తే క్వారీలోని పొక్లయిన్లు, జేసీబీలపై పనిచేస్తున్న ఆపరేటర్లు చేపట్టిన సమ్మె కొనసాగుతోంది. సోమవారం నాటికి సమ్మె నాలుగో రోజుకు చేరుకుంది. సమ్మె కారణంలో క్వారీల్లో పనులు నిలిచిపోవడంతో పరిశ్రమ స్తంభించింది. దేవరపల్లి మండలం గౌరీపట్నం, కొండగూడెం, దుద్దుకూరు, లక్ష్మీపురం, బందపురం, కొవ్వూరు మండలంలోని ఐ పంగిడి, దేచర్ల ప్రాంతంలోని క్వారీల్లోని ప్రొక్లయిన్, జేసీబీ యంత్రాలపై ఆపరేటర్లుగా సుమారు 220 మంది కార్మికులు పనిచేస్తూ ఉపాధి పొందుతున్నారు. కార్మికులకు ప్రతి మూడేళ్లకు ఒకసారి యజమానులు వేతన ఒప్పందం చేసి అమలు చేస్తారు. గత నెల 22 నాటికి వేతన ఒప్పందం మూడేళ్ల కాలపరిమితి ముగిసింది. నూతన వేతన ఒప్పదం చేయాలని కార్మికులు యజమానులకు గత నెల 7వ తేదీన డిమాండ్ల నోటీసు అందజేశారు. అయితే వేతన ఒప్పందం కాలపరిమితి ముగిసినప్పటికీ యజమానులు నుంచి ఎటువంటి పిలుపు రాకపోవడంతో ఈ నెల 9వ తేదీన కార్మికులంతా పనులను బహిష్కరించి సమ్మెకు దిగారు. గౌరీపట్నం శివారు కొండగూడెంలో కార్మికులు శిబిరం ఏర్పాటు చేసి సమ్మె చేస్తున్నారు. దీంతో కార్మికులు ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో కార్మిక శాఖ అధికారులు, పోలీస్, రెవన్యూ అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. ప్రగతి శీల కార్మిక సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు ఎస్‌కే మస్తాన్, పీఓడబ్ల్యూ నాయకురాలు ఈమని మల్లికా సమ్మె శిబిరాన్ని సందర్శించి మద్దతు తెలిపారు. గత వేతన ఒప్పందం ముగిసి 20 రోజులు అవుతున్నా, యజమానుల్లో స్పందన లేదన్నారు. ఈ ప్రాంతంలోని సుమారు 85 క్వారీల్లో దాదాపు 220 మంది ఆపరేటర్లు పనిచేస్తున్నట్టు రమేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రొక్లయిన్ ఆపరేటర్ల యూనియన్ నాయకులు గణపతి, జి.శ్రీను, ఆర్.రవికుమార్, వీరపండు, కార్మికులు పాల్గొన్నారు.

సమస్యలు సత్వరమే పరిష్కరించేలా చర్యలు

ఆర్డీవో రాణి సుస్మిత


కొవ్వూరు ఆర్డీవో కార్యాలయంలో వినతులు స్వీకరిస్తున్న ఆర్డీవో రాణీ సుస్మిత

తాళ్లపూడి(కొవ్వూరు): ప్రజల దీర్ఘకాలిక సమస్యలను సత్వరమే పరిష్కరించే విధం గా చర్యలు తీసుకుంటామని కొవ్వూరు ఆర్డీవో రాణి సుస్మిత అన్నారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో డివిజన్ స్థాయిలో సోమవారం నిర్వహించిన 'పీజీఆర్ఎస్ – మీ కోసం' వేదికలో వచ్చిన అర్జీలను ఆర్డీవో స్వీకరించారు. ఈ సందర్భంగా ఆర్డీవో రాణీ సుస్మిత మాట్లాడుతూ మీకోసం పీజీ ఆర్ఎస్ ద్వారా 9 అర్జీలు వచ్చాయని తెలిపారు. ప్రజలు తమ అర్జీలను ఇవ్వడం కోసం '1100 – మీకోసం కాల్ సెంటర్‌కు ఫోన్ ద్వారా నమోదైన ఫిర్యాదు స్థితిగతులు తెలుసుకోవచ్చునని తెలిపారు.

మీకోసంలో వచ్చిన అర్జీల వివరాలు.

కొవ్వూరు మండలం, మద్దూరు గ్రామానికి చెందిన పూసులూరి రాంబాబు పొలానికి హద్దులు చూపించి తనకు న్యాయం చేయాలని అర్జీ పెట్టుకున్నారు. ధర్మవరం గ్రామానికి చెందిన వెంపాటి శ్రీనివాస్, ఏడు సెంట్ల భూమి తక్కువ గా చూపించడం వల్ల మళ్లీ రీ సర్వే చేయించాలని వినతి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఏవో రవి విక్రమ్, డివిజన్ స్థాయి అధికారులు పాల్గొన్నారు.

వ్యవసాయ బోరుకు కనెక్షన్ తొలగించారు

వైఎస్సార్ సీపీ కార్యకర్త ఆవేదన


అధికారులకు ఫిర్యాదు చేస్తున్న బాధితుడు కనికెళ్ల పేరయ్య

నల్లజర్ల: వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ ఇచ్చినట్టే ఇచ్చి వైఎస్సార్ సీపీ కార్యకర్తను అని కొద్దిరోజులకే తొలగించారని ఓచిన్న రైతు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. నల్లజర్ల మండలం పుల్లలపాడు గ్రామంలో ఈ సంఘటన చోటుచేసుకుంది. ఈ మేరకు బాధితుడు పేరయ్య ప్రజావాణి కార్యక్రమంలో ఫిర్యాదు చేశాడు. ఆ కార్యకర్తకు అండగా ఆగ్రామ సర్పంచ్ అల్లూరి సూర్యచంద్రరావు, ఎంపీటీసీ వేగిప్రతాప్, రైతులు తాడిగడప శ్రీనివాసరావు, అల్లూరి చిన భాస్కరావు, కారెం రాంబాబు, కనికెళ్ళ ధర్మయ్య, అల్లూరి కృష్ణమూర్తి, ఆకుమూరి గంగరాజు, అల్లూరి సత్యనారాయణ వచ్చారు. రైతు పేరయ్య(ఎస్సీ)కు 876–2లో 3.30సెంట్లు భూమి ఉంది. గతంలో పరిసర రైతులు పంటకు నీళ్లిచ్చేవారు. తానే సొంతంగా బోరు వేయాలని నిర్ణయించి గత ఏడాది నవంబరులో రెవెన్యూ, భూగర్భజలశాఖకు అనుమతి కోసం దరఖాస్తు చేశాడు. సరిహద్దు రైతు కూడా తనకు ఎటువంటి ఇబ్బంది లేదని హామీ పత్రం కూడా ఇచ్చారు. ఈ ఏడాది మార్చిలో సంబంధిత శాఖల అధికారులు అనుమతులు ఇస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. మార్చి 3వ తేదీన మీటరు బిగించి విద్యుత్ సర్వీసు అమర్చారు. ఇది మూణ్ణాళ్ల ముచ్చటగానే మిగిలింది. పది రోజులు గడిచాక విద్యుత్ సర్వీసు కట్ చేశారు. ఇదేమని అడిగితే నీ సరిహద్దు రైతు బోరునకు నీకు కేవలం 90 మీటర్ల పరిధిలోనే ఉందని సరిహద్దు రైతు ఫిర్యాదు చేశారని కారణంగా చూపుతున్నారు. మేం కొలిస్తే 136 మీటర్ల దూరం ఉందని పేరయ్య వివరించారు. అనుమతులు ఇచ్చే అధికారులు అన్నీ సక్రమంగా ఉంటేనే అనుమతి ఇచ్చారని ఇప్పుడు టీడీపీ నాయకులు తనపై కక్ష కట్టి విద్యుత్ సర్వీసు తొలగించారని రైతు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. దీనిపై తగు చర్యలు తీసుకొని తనకు న్యాయం చేయాలంటూ బాధితుడు అధికారులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై ఎంపీడీఓ సింహాద్రి వివరణ ఇస్తూ దీనికి సమగ్ర విచారణ కోసం ఆయా శాఖలకు అందిస్తామన్నారు.

ప్రైవేట్ స్కూళ్లలో పేదలకు ఉచిత సీట్లు

నల్లజర్ల: పేద పిల్లలకు ప్రైవేటు స్కూళ్లలో ఉచిత ప్రవేశాలను కల్పిస్తూ విద్యాశాఖ 2025–26 విద్యా సంవత్సరాని ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. ప్రైవేటు యాజమాన్యాలు విద్యాహక్కు చట్టం –2009 సెక్షన్–12(1)సీ ప్రకారం తమ పాఠశాలలో ఒకటో తరగతిలో 25శాతం సీట్లు పేద పిల్లలకు ఉచితంగా ఇవ్వాల్సి ఉంది. అయితే దీనిపై ఎక్కడా ప్రచారం జరగకపోవడంతో ప్రజలకు తెలియడం లేదు. చిన్నారుల తల్లిదండ్రులు ఈనెల 19వ తేదీ వరకూ దరఖాస్తు చేసుకోచ్చు.

గ్రామాల్లో రాజ్యాంగ పరిరక్షణ ఉద్యమం


కమిటీ సభ్యులకు నియామక పత్రాలు అందజేస్తున్న పీసీసీ ఉపాధ్యక్షుడు మార్టిన్ లూథర్

దేవరపల్లి: కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గ్రామాల్లో రాజ్యాంగ పరిరక్షణ ఉద్యమం చేపడుతున్నట్టు పీసీసీ ఉపాధ్యక్షుడు, గోపాలపురం నియోజకవర్గ కన్వీనర్ మార్టిన్ లూథర్ తెలిపారు. దుద్దుకూరులో మండల పార్టీ కార్యాలయంలో సోమవారం జరిగిన పార్టీ సమావేశం ఆమన మాట్లాడారు. గోపాలపురం నియోజకవర్గంలో చేపడుతున్న ఉద్యమ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. జూన్‌లో పీసీసీ అధ్యక్షురాలు షర్మిలా రెడ్డి పోలవరం ప్రాజెక్టును సందర్శించనున్నట్టు ఆయన తెలిపారు. దుద్దుకూరులో స్వాతంత్ర సమరయోధులు కాకర్ల అంబారావు చిత్రపటానికి పూలమాల వేసి నివాలులు అర్పించి, అనంతరం పోలవరం పర్యటనకు వెళతారని ఆయన తెలిపారు. దుద్దుకూరు నుంచి దేవరపల్లి, గోపాలపురం, గుడ్డిగూడెం, దొండపూడి మీదుగా పోలవరం పర్యటనకు ఏర్పాట్లు చేస్తున్నట్టు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా పార్టీ అనుబంధ సంఘాల కమిటీ నూతన జిల్లా కార్యవర్గ అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, కార్యదర్శులకు నియామక పత్రాలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కిసాన్ సెల్ ఉపాధ్యక్షుడు కాకర్ల హరిబాబు, పార్టీ నాయకులు పాల్గొన్నారు. నూతన కమిటీ కార్యవర్గాన్ని ఘనంగా సత్కరించారు.

ప్రధాన రహదారిపై మురుగునీరు


రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగునీరు

దేవరపల్లి: దేవరపల్లి–గోపాలపురం రోడ్డులోని మూడు రోడ్ల కూడలిలో మురుగునీరు రహదారిపై ప్రవహిస్తోంది. మురుగునీరు దుకాణాల ముందు నుంచి ప్రవహిస్తున్నందున వ్యాపారులు, ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడం వల్ల మురుగునీరు రహదారిపై ప్రవహిస్తున్నట్టు వ్యాపారులు తెలిపారు. పంచాయతీ అధికారులు మురుగునీటి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

ఇసుక యార్డుల తనిఖీ


కుమారదేవం వద్ద స్టాక్ యార్డులో ఇసుకను పరిశీలిస్తున్న ఆర్డీవో రాణీసుస్మిత

తాళ్లపూడి(కొవ్వూరు): రానున్న వర్షాకాలం దృష్ట్యా ప్రజలకు అందుబాటులో ఇసుక ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని కొవ్వూరు ఆర్డీవో రాణి సుస్మిత తెలిపారు. కొవ్వూరు మండలంలోని చిడిపి , కుమారదేవం 1, 2, ఇసుక యార్డులను సోమవారం ఆర్డీవో రాణి సుస్మిత తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆర్డీవో రాణీసుస్మిత మాట్లాడుతూ రానున్న వర్షాకాలంలో నిర్మాణ పనులకు ఎటువంటి ఆటంకం లేకుండా ఇసుక అందుబాటులో ఉంచడం కోసం కలెక్టర్ ఆదేశాల మేరకు డివిజన్ పరిధిలో స్టాక్ పాయింట్లు ఏర్పాటు చేశామన్నారు. ఆయా స్టాక్ పాయింట్లలో ఇసుక స్టాక్ యార్డులలో అందుబాటులో ఉన్న స్టాక్‌ను పరిశీలించినట్టు ఆమె తెలిపారు. కొవ్వూరు డివిజన్ పరిధిలో ఇప్పటి వరకు 77,196 మెట్రిక్ టన్నుల ఇసుక అందుబాటులో ఉంచినట్టు పేర్కొన్నారు.

రెడ్ బుక్ రాజ్యాంగం రాజ్యమేలుతోంది

గోపాలపురం: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రాసిన రాజ్యాంగాన్ని పక్కన పెట్టి లోకేష్ రాసుకున్న రెడ్ బుక్ రాజ్యాంగం రాజ్యమేలుతోందని ఎల్లప్పుడూ ఒకే ప్రభుత్వం ఉండదని పోలీసులు గుర్తు తెచ్చుకోవాలని వైఎస్సార్ సీపీ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు సాలి వేణు అన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మాజీ మంత్రి బీసీ నేత విడదల రజినీపై చిలకలూరిపేట రూరల్ సీఐ సుబ్బారాయుడు ప్రవర్తించిన తీరు చాలా బాధాకరమన్నారు. పోలీసులు ఉన్నది కేవలం వైఎస్సార్ సీపీ నాయకులను అరెస్టు చేయడానికే అన్నట్టు ప్రవర్తించడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు.

యువతి అదృశ్యం

చాగల్లు: గ్రామానికి చెందిన యువతి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై కె.నరేంద్ర సోమవారం తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. చాగల్లుకు చెందిన మంగరాయి కామాక్షి కుమార్తె 17 ఏళ్ల యువతి ఈనెల 10వ తేదీన ఇంటి నుంచి వెళ్లి కనిపించడం లేదన్నారు. తల్లి కామాక్షి ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.

విరుల తురాయి.. ఆనందమేనోయి..



దేవరపల్లి: రహదారికి ఇరువైపులా ఉన్న తురాయి చెట్ల పువ్వులు చూపరులను ఆనందం కలిగిస్తున్నాయి. పచ్చని చెట్టుకు ఎర్రటి పుష్పాలు ఉండడంతో ఎంతో కనువిందు చేస్తున్నాయి. గుండుగొలను–కొవ్వూరు రాష్ట్ర ప్రధాన రహదారిలో దేవరపల్లి శివారున ఉన్న జగనన్న కాలనీ వద్ద ఎరుపు రంగు పుష్పాలలో పలువురిని ఆకర్షిస్తోంది. ప్రధాన రహదారికి ఆనుకుని ఈ చెట్టు ఉంది. ఇటువంటి చెట్లు రహదారులకు ఇరువైపులా ఉన్నాయి.

ముగిసిన వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాలు


విశేష అలంకరణలో అన్నవరప్పాడు వేంకటేశ్వర స్వామి,అమ్మవార్లు


వేంకటేశ్వరస్వామికి కోనేరులో చక్రస్నానం చేయిస్తున్న పండితులు


హోమంలో ద్రవ్యాలను వేస్తున్న ఈఓ రాధాకృష్ణ, గ్రామ పెద్దలు

పెరవలి: అన్నవరప్పాడు వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాలు సోమవారంతో ముగిశాయి. సోమవారం స్వామి అమ్మవార్ల కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. తెల్లవారుజాము స్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. స్వామివారికి తలనీలాలు సమర్పించారు. స్వామి వారిని బీజేపీ ఎమ్మెల్సీ సోము వీర్రాజు దర్శించుకున్నారు. ఆయనను ఆలయ అధికారులు పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. ఎన్నడూ లేని విధంగా ఈ ఒక్కరోజు స్వామి వారిని సుమారు 25 వేల మంది దర్శనం చేసుకున్నారని ఆలయ ఈఓ మీసాల రాధాకృష్ణ తెలిపారు.

కన్నుల పండువగా చక్రస్నానం

స్వామివారికి చక్రస్నానం వేలాది మంది భక్తుల సమక్షంలో వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య ఘనంగా నిర్వహించారు. కోనేరులో చక్రస్నానం సమయంలో భక్తులు నమో వెంకటేశాయా అంటూ స్వామి నామస్మరణతో మార్మోగాయి. హోమ గుండలో హోమ ద్రవ్యాలు వేస్తూ పూర్ణాహుతి నిర్వహించారు.

బౌద్ధ సిద్ధాంతాలు సమాజ నిర్మాణానికి మార్గదర్శకాలు


విద్యార్థులకు ప్రత్యేక కార్యక్రమాలు

ఉండ్రాజవరం: అహింసా, కరుణ, సమతా అనే బౌద్ధ సిద్ధాంతాలు మన సమాజ నిర్మాణానికి మార్గదర్శకాలని ఎమ్మెల్సీ సోము వీర్రాజు అన్నారు. వైశాఖ బుద్ధ పూర్ణిమ సందర్భంగా ఉండ్రాజవరం బౌద్ధ ధమ్మ పీఠంలో పీఠాధిపతి, హ్యూమన్ రైట్స్ నేషనల్ సెక్రటరీ భంతె అనాలియో ఆధ్వర్యంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం బుద్ధ వందనం తదితర ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. సోము వీర్రాజు మాట్లాడుతూ బుద్ధుని బోధనలతో పాటు విద్యార్థులకు ఉన్నత చదువులకు మంచి శిక్షణ ఇవ్వడం, నేత్ర పరీక్షలతో పాటు పలు రకాల వైద్య సేవలందిస్తున్న ఉండ్రాజవరం బౌద్ధ ధమ్మ పీఠం సేవలను కొనియాడారు. బౌద్ధధమ్మ పీఠాధిపతి భంతె అనాలియోను అభినందించారు. అనంతరం 100 మందికి ఒక్కొక్కరికి సుమారు రూ.3వేలు విలువ చేసే నిత్యావసరాల కిట్లు, మరో 50 మందికి రూ.1,000 చొప్పున నగదు పంపిణీ చేశారు. భంతె అనాలియో మాట్లాడుతూ ప్రతి ఏడాది వైశాఖ బుద్ధ పూర్ణిమ రోజు పలు సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉండ్రాజవరం, బీజేపీ నాయకులు, బౌద్ధధమ్మ పీఠం సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

శాంతి, వెలుగుల పండుగ బుద్ధపౌర్ణమి

నల్లజర్ల: ప్రపంచ వ్యాప్తంగా ఉన్న బౌద్ధులకు బుద్ధ పౌర్ణమి ఒక పవిత్రమైన పండుగలాంటిదని దూబచర్ల సంఘమిత్రా స్కూలు డైరెక్టర్ అంబటి శ్రీనివాసరావు. సోమవారం పాఠశాలలో విద్యార్థులతో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ పండగ శాంతి, వెలుగుకు చిహ్నమన్నారు. బుద్ధుని పుట్టుక, జ్ఞానోదయం, మరణం ఒకే రోజు జరిగాయన్నారు. ఈ సందర్భంగా బౌద్ధధర్మం, బుద్ధుని జీవితం, శాంతి సందేశాలపై నాటికలు, ప్రదర్శనలు, పాటలు ప్రదర్శనలు ఇచ్చారు. కార్యక్రమంలో యోగా గురువు దూబగుంట్ల రాజారావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.